క్లుప్తంగా

7న డయల్ యువర్ డీఎం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు డిపో పరిధిలోని పట్టణ, చుట్టుపక్కల గ్రామాల ప్రయాణికులు తమ సమస్యలను విన్నవించుకునేందుకు ఈనెల 7న మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు ఫోన్ చేసి తమ సమస్యలను, సూచనలను, సలహాలను తెలపవచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు అన్నవరంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. అన్నవరం గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలగే అవసరమైన మందులు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి తెలియజేశారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా రామసుబ్బయ్య

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన గంజికుంట రామసుబ్బయ్యను బీజేపీ జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేయడంపై పలువురు అభినందనలు తెలిపారు. రాజుపాళెం మండలం మైనారిటీ మోర్చా అధ్యక్షులుగా కొర్రపాడు గ్రామానికి చెందిన ముల్లా అస్మద్‌ను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

క్రీస్తుమార్గం అనుసరణీయం

కలసపాడు : క్రీస్తుమార్గం అనుసరణీయమని నంద్యాల డయాసిస్ బిషప్ పుష్పలలిత తెలిపారు. ఆదివారం స్థానిక పరిపేతురు పరిపాలు చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ప్రసంగించారు. చర్చికి వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం బిషప్‌ను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రెవ.సంజయ్‌మధు, రెవ. అఫీస్ గార్బియేల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన' కార్యక్రమం

గోపవరం : తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. అన్నిశాఖల అధికారులు స్పందనలో పాల్గొంటున్నందున మండల వ్యాప్తంగా ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : స్థానిక మట్టి మసీదు వీధిలో దస్తుమియా అండ్ సన్స్ షేక్ ఖాదర్‌వలి ఆధ్వర్యంలో ఆదివారం గార్మీ పండుగ సందర్భంగా జెండాను మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించి జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు వీఎస్ ముక్తియార్ చేతుల మీదుగా దివ్యాంగులకు, పేదలకు, మదరసాలో చదివే విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, వై.చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

పోరుమామిళ్ల : ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక పరమైన బకాయిలు చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పోరుమామిళ్లలో జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన కరువుబత్యం, పీఆర్సీ వాయిదాలలో కాకుండా ఒకేసారి చెల్లించాలన్నారు. పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐసీ, ఆర్జిత సెలవుల బకాయిలు సంవత్సరాల తరబడి జాప్యం చేస్తున్నారన్నారు. పాఠశాలల విలీనానికి సంబంధించిన జీఓ నెం. 117 రద్దు చేయాలన్నారు. జీపీఎస్ రద్దు చేయాలన్నారు. ప్రతినెల 1న వేతనాలు చెల్లించాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

వైవీయూ : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా కోరారు. ఆదివారం కడప నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానం, సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. విజయ్‌కుమార్, పి.మహేష్‌బాబు పాల్గొన్నారు.

ఆ దారిలో ప్రయాణం.. నరకప్రాయం



పోరుమామిళ్ల రోడ్డులో వాహనాలు ఎదురెదురుగా రావడంతో స్తంభించిన ట్రాఫిక్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని మెయిన్‌బజార్ (పోరుమామిళ్ల రోడ్డు) గాంధీ బొమ్మ సెంటర్ నుంచి ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. రోడ్డుకు ఇరువైపులా పూర్తిస్థాయిలో ఆక్రమణలు ఉండటంతో రోడ్డు కుచించుకుపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ రోడ్డులో రెండు వాహనాలు ఒకేసారివచ్చినా లేదా ఎదురెదురుగా వచ్చినా వెళ్లే దారిలేక భారీగా వాహనాలు ఆగిపోవడం షరామాములే అయింది. అసలే ఇరుకు రహదారితో ప్రజలు సతమతమవుతుంటే.. ఇదే దారి వెంట రెండు ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, ఆయిల్ మిల్ కార్యాలయం ఉండటంతో భారీ వాహనాలు ఈ దారి వెంట తిరుగుతూ మరో పెద్ద సమస్యగా మారింది. ఈ దారిలో రెండు మసీదులతో పాటు రెండు ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు ఉండటంతో నిత్యం జనసంచారం అధికంగా ఉంటోంది. ఈ సమయంలో వాహనాలు నిలిచిపోయి పాదచారులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ దారిని విస్తరించడానికి గతంలో కొలతలు వేసి మార్కింగ్ ఇచ్చినప్పటికీ పనులు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం ఈ సమస్య గట్టెక్కాలంటే పోరుమామిళ్ల బైపాస్‌రోడ్డు వెంట భారీ వాహనాలు, బస్సులను తిరిగేటట్లు చేసి పోరుమామిళ్ల రోడ్డు వెంట ద్విచక్రవాహనాలు, ఆటోలకు మాత్రమే అనుమతిస్తే సమస్య కొంతమేరకైనా పరిష్కారమవుతుందని ఆ దిశగా పోలీసులు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

స్పీడ్‌బ్రేకర్లను తొలగించండి

గోపవరం : మండలంలోని పి.పి.కుంట నుంచి బ్రాహ్మణపల్లె వరకు ఆర్అండ్‌బీ రోడ్డుపై అడ్డదిడ్డంగా వేసిన స్పీడ్‌బ్రేకర్లను తొలగించాలని ప్రయాణికులతో పాటు వాహనదారులు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. 15 కిలోమీటర్లు ఉన్న పి.పి.కుంట నుంచి బ్రాహ్మణపల్లె వరకు 58 స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు తెలిపారు. బద్వేలు నుంచి బ్రాహ్మణపల్లె వరకు ఒకే ఆర్టీసీ బస్సు తిరుగుతుంది. మధ్యలో ఒక ట్రిప్పు కడపకు వెళ్ళి వస్తున్నందున బస్సును కంటిన్యూగా బ్రాహ్మణపల్లెకు తిప్పాలని ఇటీవల స్థానికులు ఆర్టీసీ డీఎం దృష్టికి తీసుకెళ్ళారు. అయితే స్పీడ్‌బ్రేకర్లు అధికంగా ఉన్నందున డ్రైవర్లు కూడా ఈ రూట్‌కు వచ్చేందుకు సుముఖత చూపడం లేదని అధికారులు చెబుతున్నారు. రోడ్డు పక్కన పాఠశాలలు ఉన్న చోట స్పీడ్‌బ్రేకర్లు ఉంచి మిగిలిన స్పీడ్ బ్రేకర్లను తొలగించాలని, అప్పుడే బస్సును అన్ని ట్రిప్పులు తిప్పుతామని ఆర్టీసీ సిబ్బంది పేర్కొంటున్నారు. ఇటీవల రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ ఇబ్బందికరంగా మారిన స్పీడ్‌బ్రేకర్ల విషయాన్ని ఆర్అండ్‌బీ జేఈ రెడ్డిగోవింద దృష్టికి తీసుకెళ్ళారు. అనుమతి లేకుండా ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద స్పీడ్ బ్రేకర్లు వేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని నివారించాలంటే స్పీడ్‌బ్రేకర్లు తొలగించాలని ఎస్ఐ పేర్కొన్నారు. అలాగే సుదర్శన ఆశ్రమం వద్ద ఎన్‌హెచ్–67 జాతీయ రహదారిపై వేసిన స్పీడ్‌బ్రేకర్ల వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. స్పీడ్‌బ్రేకర్లను తొలగించి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని ఎస్ఐ అధికారులకు తెలిపారు.

అవినీతి నిర్మూలనకు కృషి చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రతి ఒక్కరూ అవినీతి నిర్మూలనకు కృషి చేయాలని యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా యూనియన్ బ్యాంకు వారు అవగాహన కల్పించారు. అనంతరం ఏడురోడ్లు, కోటిరెడ్డి సర్కిల్, ఎస్పీ బంగ్లా, నెహ్రూ పార్కు మీదుగా మున్సిపల్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ×సే నో టు కరెప్షన్–కమిట్ టు నేషన్× అనేనినాదంతో అవినీతి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం, అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రీజినల్ హెడ్ షేక్ బాష, సురేష్, వివిధ శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుడి మృతికి సంతాపం



మున్సిపల్ కార్మికుడు పుల్లయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మైదుకూరు : మైదుకూరు మున్సిపల్ కార్మికుడు బీవీ పుల్లయ్య మృతి పట్ల ఆదివారం మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర సంతాపం తెలిపారు. మున్సిపాలిటీలో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పుల్లయ్య అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మున్సిపల్ చైర్మన్ మృతుని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ నాయకులు శ్రీరాములు, ఏవీ శివరాం, బీవీ శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గవ్వల వెంకటసుబ్బయ్య, పి.వెంకటసుబ్బయ్య, ఆలీ, రాజారావు, దాసరి సతీష్ తదితరులు కార్మికుడు పుల్లయ్య నివాళి అర్పించారు. పుల్లయ్యకు రావాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్ తదితర బెనిఫిట్స్ త్వరగా చెల్లించాలని, ఆయన కుటుంబంలో ఒకరికి మున్సిపాలిటీలో ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో కాలభైరవ విగ్రహ చర ప్రతిష్ఠ

కడప కల్చరల్ : నగర శివార్లలోని శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం చర విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఎంఎస్ కొట్టాల కాలభైరవ పురంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. నగరానికి చెందిన అమృతవల్లి ప్రకాశ్ స్వయంగా తయారు చేయించిన శ్రీ కాలభైరవస్వామి ఉత్సవ మూర్తిని శాస్త్రోక్తంగా ఆలయ నిర్వాహకులు బాసట బాలాజీరావుతో పాటు అర్చకులకు అందజేశారు. ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డితోపాటు విగ్రహదాత అమృతవల్లి ప్రకాశ్ కుటుంబ సభ్యులు, పలువురు ధార్మికవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా కొండయ్య స్వామి జన్మదిన వేడుకలు



భక్తుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటున్న కొండయ్య స్వామి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలోని తిమ్మాయపల్లెలో ఆదివారం అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల సమక్షంలో కొండయ్య స్వామి జన్మదిన కేక్‌ను కట్ చేశారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర కొండయ్య స్వామిని దర్శించుకోగా, ఆయన చైర్మన్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం చెక్కభజన, కోలాటం కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రాత్రి జబర్దస్త్ కార్యక్రమం, ఆర్కెస్ట్రా, పౌరాణిక నాటకాల ప్రదర్శన నిర్వహించారు. సోమ, మంగళవారాల్లో బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పలు పాఠశాలల్లో అధిక ఫీజు వసూలు

వైవీయూ : పదో తరగతి పరీక్ష ఫీజును ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల దోపిడీతో ఆగకుండా పరీక్ష ఫీజుల్లో కూడా దోపిడీకి పాల్పడుతుండటం బాధాకరమన్నారు. పదోతరగతి పరీక్ష ఫీజు రూ.125గా ప్రభుత్వం నిర్ణయిస్తే కొన్ని పాఠశాలలు రూ.1500 నుంచి రూ.2 వేల వరకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నాయన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్‌తేజ, శ్రీనాథ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాళ్లబండి సంపత్‌ను సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ 1978–79 బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం టీటీడీ కళ్యాణ మండపంలో జరిగింది. ఇక్కడి పాఠశాలలో చదువుకుని వివిధ ప్రాంతాల్లో సెటిలైన వారంతా దాదాపు 43 ఏళ్ల తరువాత పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను తలుచుకున్నారు. అప్పటి తమ ప్రధానోపాధ్యాయుడు రాళ్లబండి సంపత్, ఉపాధ్యాయుడు కొవ్వూరు రాజగోపాల్‌రెడ్డిలకు పాదాభివందనం చేసి వారిని శాలువ కప్పి, జ్ఞాపిక, పూలమాలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాలతో ఈ వేడుకను జరుపుకొని అందరు గుర్తుగా ఫోటో తీయించుకున్నారు. పూర్వవిద్యార్థులు బివి.నాగప్రసాద్, రంగనాథ్, ప్రభాకర్ రెడ్డి, శాంతారామ్, కుంభం పాములేటి, రశీద్‌ఖాన్ పాల్గొన్నారు.

7 నుంచి శాస్త్రీయ దృక్పథ ప్రచారం

వైవీయూ: నవంబర్ 7 నుంచి 2024 ఫిబ్రవరి 28వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శాస్త్రీయ దృక్పథ ప్రచారం నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలో జనవిజ్ఞానవేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీవీరామన్ జయంతి వరకు పాఠశాలలు, కళాశాలలు, పట్టణాలు, గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. చెకుముకి సంబరాలను ఈనెల 10న ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజా, రాజశేఖర్‌రాహుల్, జనవిజ్ఞానవేదిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



సత్యసింహారెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయసేవా కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయస్థాయి రోప్‌జంప్ పోటీలకు ఎంపికైన రాజుపాళెం చెందిన సత్యసింహారెడ్డికి అభినందన కార్యక్రమం జరిగింది. ఈ విద్యార్థి ఇటీవల షిరిడీలో జరిగిన జాతీయస్థాయి రోప్‌జంప్ పోటీల్లో ప్రతిభ కనపరచి బంగారు పతకం సాధించి డిసెంబర్ 15న థాయిలాండ్‌లో జరుగునున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొననున్నాడు. సత్యసింహారెడ్డిని సంస్మృతి స్వచ్ఛందసేవాసంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి పూలమాల వేసి శాలువతో సత్కరించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ఓబుళరెడ్డి రూ.2వేలు, మూరుకూటి సూర్యనారాయణరెడ్డి రూ.2వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం, అధ్యాపకుడు ఆకేపాటి శివశంకర్ రెడ్డి, పంజగల మధుసూదన్‌బాబు, ఎస్ఎల్‌టీపీ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

అధునాతన పరిజ్ఞానంతో ఫొటోగ్రఫీకి ఆదరణ

కడప కల్చరల్ : ఫొటో, వీడియోగ్రఫీ రంగంలో రాణించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ప్రముఖ ఫొటోగ్రఫీ టెక్నిషియన్, ఫ్యాకల్టీ కెనాన్ భూపాల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.చంద్రారెడ్డి, కడప అసోసియేషన్ అధ్యక్షులు శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆదివారం నగర పరిధిలోని జయరాజ గార్డెన్స్‌లో ఆధునిక ఫొటో, వీడియో కెమెరాల నిర్వహణ, ఈ రంగంలో వస్తున్న మార్పుల గురించి, అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు గురించి ఆయన వివరించారు. ఉదయం వీడియోగ్రఫీపై, భోజనానంతరం ఫొటోగ్రఫీపై ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి సంస్థ ఉపాధ్యక్షులు జిలానీబాషా, కార్యదర్శి శివరామకృష్ణ, సహ కార్యదర్శి ప్రభు,భూపాల్‌తోపాటు సీనియర్ ఫొటోగ్రాఫర్లు, సంఘం ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ఫొటో, వీడియోగ్రాఫర్లు హాజరయ్యారు.ప్రముఖ గ్యాస్ట్రో అండ్ లివర్ స్పెషలిస్టు కృష్ణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

రామకథకు రమణీయత కూర్చిన మొల్ల



మాట్లాడుతున్న శతావధాని ఆముదాల మురళి

కడప కల్చరల్ : మన జిల్లా ఆడబిడ్డ, తొలి తెలుగు రామాయణ కవయిత్రి మొల్లమాంబ శ్రీరామ కథకు రమణీతను కూర్చారని తిరుపతికి చెందిన శతావధాని ఆముదాల మురళి అన్నారు. ఆదివారం కడప నగరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో ఆయన మొల్ల రామాయణ సౌందర్యం అనే అంశంపై ప్రసంగించారు. వాల్మీకి రామాయణానికి వందలాది అనువాదాలు వచ్చినా మొల్ల తన కవిత్వానికి ప్రత్యేకమైన రంగు, రుచితో తెలుగు పాఠకులకు అందజేసి తన ప్రత్యేకతను చాటుకున్నారని తెలిపారు. గానుగపెంట హనుమంతరావు మాట్లాడుతూ మొల్ల రామాయణ పద్యాలలో మల్లె పరిమళం ఉంటుందన్నారు. అనంతరం అవధాని మురళిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.రామమూర్తినాయుడు, సంయుక్త కార్యదర్శి తుపాకుల నారాయణ, సాహితీవేత్త డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు లబ్ధి



కోనేటి శివకుమార్‌రెడ్డికి రూ.6లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా పేదలకు ఎంతో లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మంది లబ్ధిదారులకు రూ.10లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జాబితాలో లేని వారు ఆపరేషన్ చేయించుకున్న తర్వాత ముఖ్యమంత్రి జగన్ ఈ నిధులను మంజూరు చేశారన్నారు.నియోజకవర్గంలో 24 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, ఎమ్మార్పీఎస్ సుధాకర్ పాల్గొన్నారు.

ఇండ్లు కూల్చినందుకు నిరసన



అంబేడ్కర్ సర్కిల్‌లో వంటావార్పు చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

పోరుమామిళ్ల : స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్, మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ శనివారం తహసీల్దారు గంగయ్య రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలసి జీబీనగర్‌లో పేదల ఇండ్లు కూలగొట్టారన్నారు. అక్కడ చాలా ఏండ్లుగా నివసిస్తున్న పేదలు రోడ్డున పడ్డారన్నారు. వారికి ఇంటిస్థలం ఇవ్వాలని, ఇండ్లు నిర్మించుకునేందుకు సహాయం చేయాలన్నారు. అన్యాయంగా కూల్చిన తహసీల్దారు గంగయ్యను సస్పెండ్ చేయాలన్నారు. 32 పేదల ఇండ్లు కూల్చినందుకు నిరసనగా వంటా వార్పు కార్యక్రమం చేస్తున్నామని, సోమవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు ప్రత్యేక శిబిరాల పరిశీలన



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ కౌసర్‌భాను

బ్రహ్మంగారిమఠం : మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ఓటరు ప్రత్యేక శిబిరాలను ఆదివారం డిప్యూటీ కలెక్టర్, మైదుకూరు నియోజకవర్గం ఈఆర్‌ఓ కౌసర్ భాను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఆర్‌ఓ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఓటర్లను చేర్చడం, తొలగించడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సోమిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం కన్వీనర్ జోగయ్య మాట్లాడుతూ నూతన ఓటర్లను చేర్చుకోవడంలో ఫోన్ యాప్‌ల ద్వారా అవకాశం ఇచ్చారు. కొన్ని చోట్ల నెట్‌వర్కు సరిగా రాక పోవడంతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. ఫోన్ ద్వారా కాకుండా మ్యాన్‌వల్ ద్వారా చేర్పులు, మార్పులు చేయవచ్చని ఈఆర్‌ఓ తెలిపారు. కార్యక్రమంలోపంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, బూత్ కన్వీనర్ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రవీణ్ టీడీపీ ఇన్‌చార్జి అయ్యాకే గొడవలు

ప్రొద్దుటూరు : టీడీపీ ఇన్‌చార్జిగా ప్రవీణ్ కుమార్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నాకే నియోజకవర్గంలో గొడవలు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎంతో మంది టీడీపీ ఇన్‌చార్జిలుగా ఇక్కడ ఉన్నారన్నారు. వారి హయాంలో ఎప్పుడూ ఇలాంటి సంఘటనలు జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త బెనర్జీపై హత్యాయత్నం జరగడానికి కూడా ప్రవీణే అన్నారు. ఈ సంఘటనతో సంబంధం లేకుంటే వారం రోజులుగా ఎందుకు కనిపించకుండా ఆయన పారిపోయాడని ప్రశ్నించారు. హత్యాయత్నంతో సంబంధం లేకుంటే ఎస్పీ ఎదుట హాజరై తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని తెలిపారు.

గంగమ్మకు జలాభిషేకం



కుందూ నది నుంచి బిందెలతో నీటిని తెస్తున్న మహిళలు

రాజుపాళెం : వర్షం కురవాలని కోరుతూ మండలంలోని తొలండలదిన్నె గ్రామంలో ఆదివారం గంగమ్మకు జలాభిషేకం చేశారు. ఇంటికొక బిందె తెచ్చుకుని గ్రామ సమీపంలోని కుందూ నీటిని తీసుకొచ్చి గంగమ్మ ఆలయం వరకు నీరు పోసుకుంటూ వచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి టెంకాయలు కొట్టారు. అనంతరం జంతు బలులు సమర్పించారు.

వర్షం.. హర్షం



పచ్చగా కళకళ లాడుతున్న మినుము పంట

రాజుపాళెం : బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో ఆదివారం సాయంత్రం వర్షం పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మినుము, పెసర, పత్తి, పసుపు, మొక్కజొన్న తదితర పంటలను ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేశారు. సకాలంలో వర్షాలు పడకపోవడంతో రైతులు కష్టపడి పంటలకు నీటి తడులు అందిస్తున్నారు. ఈ క్రమంలో వర్షం పడటంతో రైతన్నట్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 42.4 మిల్లీమీటర్లు వర్షం పాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడి నియామకం



పల్లె సుబ్బారెడ్డిని అభినందిస్తున్న వంగల శశిధర్‌రెడ్డి

దువ్వూరు : దువ్వూరు మండల బీజేపీ అధ్యక్షుడిగా పెద్దశింగనపల్లె గ్రామానికి చెందిన పల్లె సుబ్బారెడ్డిని నియమించినట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దువ్వూరులోని బండి కల్యాణ మండపంలో బీజేపీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రజా స్వామ్య లక్షణాలు ఉన్న పార్టీ అని, గత 9 ఏళ్లుగా బలమైన భారత దేశాన్ని నిర్మించడంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరవేటి హరికృష్ణ, బ్రహ్మాచారి, రాజగోపాల్‌రెడ్డి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కడప బాలోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు

కడప కల్చరల్ : కడప బాలోత్సవ నిర్వహణకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 11న కడప నగరం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో పోటీలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు బాలోత్సవం కన్వీనింగ్ కమిటీ ప్రతినిధి, పూర్వ ఎమ్మెల్సీ గేయానంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం కళాశాలను సందర్శించింది. ఈనెల 11న కళాశాలలో బాలోత్సవంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీ నిర్వహించనున్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను ఈ బృందం స్వయంగా పర్యవేక్షించింది. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ శనివారం నిర్వహించనున్న బాలోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కళాశాలలు, పాఠశాలలు, తల్లిదండ్రులు, విద్యార్థులు తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రస్తుతం పిల్లలు చదువులతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, దాని నుంచి బయటపడేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతైనా అవసరమన్నారు. పరిశ్రమలశాఖ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ మాట్లాడుతూ ఇలాంటి పోటీల ద్వారా పిల్లల్లో సృజనతోపాటు పోటీతత్వం పెరుగుతుందని, తల్లిదండ్రులు వారిని ఈ దిశగా ప్రోత్సహించి వారిలోని నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు తగిన సహకారం అందించాలని సూచించారు. కన్వీనర్లు రాజశేఖర రాహుల్, లక్ష్మీరాజా, రచయిత రామసుబ్బమ్మలు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నిర్వాహకులతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సంస్థ సభ్యులు వెంకట రామరాజు, నరసింహారెడ్డి, డాక్టర్ తవ్వా సురేష్, వెంకట సుబ్బయ్య, యుగంధర్, త్రిమూర్తులురెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.